క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌గౌడ్ బదిలీ



యాలాల: డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌గౌడ్ బదిలీ అయ్యారు. యాలాల నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా ఎవరూ బాధ్యతలు తీసుకోలేదు. మరో రెండు రోజుల్లో కొత్త డీటీ విధుల్లో చేరే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ బాధ్యతల కోసం తన పేరు మార్పుపై కలెక్టర్‌కు నివేదించినట్లు తహసీల్దార్ అంజయ్య పేర్కొన్నారు. ఆన్‌లైన్లో శనివారం వరకు తహసీల్దార్ పేరిట ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

టీడీసీఏ క్రికెట్ టోర్నీలో బాలుర సత్తా

ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జిల్లాపై గెలుపు



ట్రోఫీతో టీడీసీఏ ఎలెవన్ జట్టు

తాండూరు టౌన్: అంతర్ ఉమ్మడి జిల్లాల అండర్–17 టీ–20 క్రికెట్ టోర్నీలో తాండూరు బాలురు సత్తా చాటారు. హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఈ పోటీల్లో పట్టణంలోని సహారా క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పలువురు బాలురు టీడీసీఏ ఎలెవన్ జట్టు తరుపున ఆడారు. శుక్రవారం నిర్వహించిన ఫైనల్‌లో ఎలెవన్ జట్టు, మహబూబ్‌నగర్ జట్టుపై గెలిచి ట్రోఫీ సాధించింది. తాండూరు క్రీడాకారులను కోచ్‌లు జగన్నాథ్ రెడ్డి, సుదర్శన్, టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వేంకటేశ్వర్ రెడ్డి తాండూరు వాసులు అభినందించారు.

బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే

యాలాల: పగిడియాల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన మల్లేశ్, సాయిలును పార్టీలోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, బసిరెడ్డి, శరణుభూపాల్, శ్రీశైలం, గిరిజాపూర్ రఘు పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగుల పెన్‌డౌన్



కోట్‌పల్లిలో పెన్‌డౌన్ చేస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

బంట్వారం: పెండింగ్ వేతనాలతో పాటు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈజీఎస్ ఉద్యోగులు శుక్రవారం పెన్‌డౌన్ చేపట్టి నిరసన తెలిపారు. బంట్వారం, కోట్‌పల్లి మండల కేంద్రాల్లోని ఈజీఎస్ కార్యాలయాల్లో ఉపాధి హామీ ఉద్యోగులు విధులకు హాజరై పెన్‌డౌన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. చాలా కాలంగా పని చేస్తున్న తమను గుర్తించి పేస్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మోమిన్‌పేటలో బస్టాండ్ ఎదుట సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కూడా రెండు కళ్లతో సమానంగా సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే అభివృద్ధికి నిధులు కెటాయిస్తున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు సిరాజోద్దీన్, ఎజాస్ పటేల్, రవి, వెంకట్, నర్సింలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి నిధులు మంజూరయ్యేనా?

- ఎన్‌క్యూఏఎస్ ఎంపిక చేసి రెండేళ్లు
- ఫండ్స్ కోసం ఎదురుచూపులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైద్యసిబ్బంది
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్ పీహెచ్‌సీ

దౌల్తాబాద్: ప్రజలకు వైద్యసేవలందిచడంలో జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించే ఆసుపత్రుల అభివృద్ధికి నిధులు మంజూరు కావడంలేదు. పీహెచ్‌సీకి ప్రతీ ఏడాది నిధులు విడుదల కావాల్సి ఉండగా మూడేళ్లుగా చిల్లిగవ్వ రాలేదు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్సురెన్స్ స్టాండర్డ్స్) బృందం ఎంపిక చేస్తుంది. ఈ క్రమంలో దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిక చేశారు. 2023, జులైలో కేంద్ర ప్రభుత్వ బృందం దౌల్తాబాద్ పీహెచ్‌సీని సందర్శించింది. ఆస్పత్రిలోని ఓపీ, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ప్రసూతి వార్డు తదితర విభాగాల్లో సేవలు, రికార్డులు, పరిసరాలను పరిగణలోకి తీసుకుని పరిశీలించారు. సేవల నిర్వహణలో విభాగాల వారీగాపాయింట్లు కేటాయించారు. ఇందులో దౌల్తాబాద్ పీహెచ్‌సీకి 83.14 పాయింట్లు ఇచ్చారు. అత్యధిక పాయింట్లు సాధించిన పీహెచ్‌సీకి ఏడాదికి రూ.3లక్షలు వరకు నిధులు కేటాయిస్తారని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల కాలేదు. బృందం పర్యవేక్షణకు వచ్చిన సమయంలో పీహెచ్‌సీని జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపిక చేసి మూడేళ్లు గడుస్తున్నా నిధులు మంజూరు కాకపోవడంతో వైద్యాధికారులపై తీవ్ర ఆర్థికభారం పడుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులను మంజూరు చేయాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

ఎంపిక చేస్తే...

ఎన్‌క్యూఏఎస్ బృందం పీహెచ్‌సీని ఎంపిక చేస్తే నాలుగు సంవత్సరాల వరకు పీహెచ్‌సీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయించాలి. పీహెచ్‌సీ పరిధిలోని జనాభా హెల్త్ సబ్‌సెంటర్ల ప్రతిపాదన దృష్టిలో ఉంచుకొని నిధులను మంజూరు చేస్తుంది. రూ.2.75లక్షల నుంచి రూ.4లక్షల వరకు నాలుగేళ్ల పాటు మంజూరు చేయాల్సి వస్తుంది. కానీ మూడేళ్లుగా నిధుల మంజూరుకు మోక్షం లభించడంలేదు. కేటాయించిన నిధుల నుంచి నిర్వహణ ఖర్చులు అభివృద్ధికి అలవెన్సులు తీసుకోవచ్చు. ఈ విషయంలో ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ప్రత్యేక నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి

- ఉమ్మడి కుల్కచర్లకు రూ.69కోట్ల రుణమాఫీ
- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల పక్షపాతి అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేనంతగా రూ. 69కోట్ల నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమచేసి వారి రుణాలను మాఫీ చేశారన్నారు. గత ప్రభుత్వం రూ. లక్ష రుణ మాఫీ కూడా చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీపై ఆరోపణలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. పరిగి నుంచి షాద్‌నగర్ వరకు 4లైన్ల రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారన్నారు. చౌడాపూర్ నుంచి లాల్‌పహాడ్ వరకు డబుల్ రోడ్డును వేయించడానికి ప్రక్రియను ప్రారంభించారన్నారు. గ్రామీణ రోడ్లను అభివృద్ధిపరిచి రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు.

జెడ్పీ పీఠాన్ని హస్తగతం చేసుకుంటాం..

త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రానున్నాయని, గ్రామాల్లోని నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలుపొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వికారాబాద్ జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకోబోతున్నామన్నారు. కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కలిసికట్టుగా ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఆనందం, మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, శివరాం నాయక్, మోత్కూరు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి



బషీరాబాద్‌లో ఎంఈఓ దంపతులకు సన్మానం



సుధాకర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్లో ఉపాధ్యాయులు, సంఘం నేతలు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎంఈఓగా యాలాల మండలంతో పాటు బషీరాబాద్ మండలానికి సుధాకర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. సుధాకర్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారన్నారు. సంఘాలకు సంబంధం లేకుండా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు పురుషోత్తంరావు, శ్రీనివాస్, పీఆర్టీయూ, టీపీయూఎస్, టీయూటీఎఫ్ తదితర సంఘాలకు చెందిన ఉపాధ్యాయ నేతలు వెంకట్‌రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మొగులయ్య, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, లక్ష్మీకాంతరావు, నరహరిరెడ్డి, వెంకటేశ్ ప్రసాద్, దీపక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు శాశ్వతం

బషీరాబాద్: మండల విద్యాధికారిగా సుధాకర్‌రెడ్డి సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయని పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్‌రెడ్డిని శుక్రవారం స్థానిక ఎస్వీఆర్ గార్డెన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రవికాంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మోమిన్‌పేట: ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారుల సర్వేను 15రోజుల క్రితం పూర్తి చేశారు. అందులో అర్హత ఉన్న వారి జాబితా నుంచి ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరిగా సర్వే చేసి తుది జాబితాను ప్రకటించనున్నారు. ముందుగా ఎల్1లో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి మొదటి జాబితాలో అర్హులుగా గుర్తిస్తారు. ఎల్2లో ఇల్లు లేకుండా ఉండి ఇంటి స్థలం లేని వారిని ప్రకటిస్తారు. తర్వాత ఎల్3లో ఇంటి స్థలం, ఇల్లు లేకుండా ఉన్న వారిని ప్రాధాన్యత ఇస్తారు. అందుకు రెవెన్యూ సిబ్బంది మళ్లీ సర్వే ప్రారంభించారు.

ప్రతీ మొక్కను సంరక్షించాలి



రుద్రారం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: ప్రతీ మొక్కను సంరక్షించాలని తహసీల్దార్ విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామ శివారులో ఏర్పాటుచేసిన నర్సరీలో ఎంపీడీఓ ఉషశ్రీ, తహసీల్దార్ విజయకుమార్ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాలు కురవాలంటే విస్తారంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలను పంపిణీ చేయడానికి నర్సరీలో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నీటిని అందిస్తూ ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉత్తములుగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారు



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, స్థానిక నాయకులు

కుల్కచర్ల: ఉద్యోగం కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వారు ప్రజల గుండెల్లో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిపోతారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాలకు చెందిన రైతులు శ్రీనివాస్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, శివరాం, విఠల్ నాయక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చాకలి నర్సిములు అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో రూ.2లక్షల ఇన్సూరెన్స్ మంజూరయ్యింది. శుక్రవారం తాండూరు పట్టణంలో మృతుని భార్య లక్ష్మీకి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ... ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, మాజీ సర్పంచు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్ ఎగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండొద్దు

మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

బొంరాస్‌పేట: ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండొద్దని, వృత్తిలో అశ్రద్ధ వహిస్తే భావితరానికి నష్టం వాటిల్లుతుందని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటెపల్లి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితోపాధ్యాయుడు ఉపేందర్ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి దేశ రాజకీయాలు, చరిత్ర పురుషులుగా పేరుగాంచిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఎదగాలన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే ఉపాధ్యాయుల బోధనలు పుణికిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీఆర్టీయూ అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరిరాజేశ్‌రెడ్డి, ఎంఈఓ హరిలాల్, మాజీ వైస్‌ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, మల్లయ్య, గోపాల్, పరమేశ్వరి, శ్రీహరి, సుధాకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు బోనాలు



తింసన్‌పల్లిలో బోనాలతో మహిళలు

తాండూరు రూరల్: తింసన్‌పల్లి గ్రామంలో బోనాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా గ్రామంలో జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పోచమ్మ, మైసమ్మ, ఊరడమ్మ అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం గ్రామదేవత ఊరడమ్మ అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పువాయిద్యాలతో మహిళలు బోనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి



గంజిపల్లి తండాలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవంలో ఎంఈఓ వెంకట్

దోమ: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని దోమ మండల విద్యాధికారి వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని గంజిపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గంజిపల్లి, పీర్లగుట్ట, చెర్లతండా పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు విద్యాశాఖ సూచించిన పద్ధతులను పాటిస్తూ సరళమైనవిధంగా పాఠ్యబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్, సీఆర్పీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే జీవితం సార్థకత



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

కొడంగల్: ప్రజా సేవతోనే జీవితం సార్థకత అవుతుందని లయన్స్ క్లబ్ పాలమూరు రీజియన్ చైర్మన్ పాలెమోని అశోక్ కుమార్, ఇన్నర్ క్యాబినెట్ మెంబర్, జిల్లా సమన్వయకర్త డాక్టర్ శశికాంత్, కొడంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ఠ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్‌సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పసుల కిష్టారెడ్డి ఫంక్షన్ హాల్లో రీజియన్ సమావేశం ఉంటుందని అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ డైరీలను పంపిణీ చేశారు. జిల్లా సమన్వయకర్త డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా గవర్నర్‌గా తాను పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి శివకుమార్ గుప్తా, కోశాధికారి వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, సభ్యులు ఏన్గుల భాస్కర్, మిఠాయి రాజు, డాక్టర్ సాకేత్, డాక్టర్ నాగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొడంగల్ సభ్యులు జిల్లా సభ్యులకు సన్మానం చేశారు.

చౌడాపూర్ మండలం మాకొద్దు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మాకొద్దని మమ్మల్ని మహబూబ్‌నగర్ జిల్లాలో కలపాలని ముదిరాజ్ చైతన్యవేదిక రాష్ట్ర కార్యదర్శి పిట్ల నర్సింలు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ రమేశ్‌కు మరికల్ గ్రామాన్ని మండలం చేయాలి లేదా తమను మహబూబ్‌నగర్ జిల్లాలో కలపాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చౌడాపూర్ మండలంతో తమకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్నారు. చౌడాపూర్ మండల పరిషత్ తమకు వద్దని త్వరలో వివిధ గ్రామాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నూతన భవనం మంజూరు చేయండి

యాలాల: మండలంలోని దేవనూరు ఉన్నత పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ శివకుమార్ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాఠశాలకు కొత్త భవన నిర్మాణం కోసం గతంలో సర్వే నెంబరు 281లో మూడు ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త భవనం మంజూరయితే విద్యార్థులకు సమస్యలు ఉండవన్నారు. వీటితో పాటు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

• నిలిచిన రిజిస్ట్రేషన్లు

బంట్వారం: సర్వర్ సమస్యతో బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో కొన్ని రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల్లో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ధరణి సర్వర్ సమస్య ఏర్పడిన మాట వాస్తవమేనని శుక్రవారం సాయంత్రం సర్వర్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

• ఉత్తమ ఎంపీడీఓగా వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట: జిల్లా ఉత్తమ మండల అభివృద్ధి అధికారిగా బొంరాస్‌పేట ఎంపీడీఓ వెంకన్నగౌడ్ గుర్తింపు పొందారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు.

• టేకులపల్లిలో ఘటాభిషేకం

మోమిన్‌పేట: మండల పరిధిలోని టేకులపల్లిలో శివ స్వాములు ఘటాభిషేకం నిర్వహించారు. 108కుండలలో నీటిని తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఈశ్వరుని మందిరానికి తీసుకెళ్లారు. ఎంతో భక్తిశ్రద్ధలతో శివ స్వాములు, గ్రామస్తులు అగ్ని గుండం తయారు చేసి అందులో నడిచారు.

• మద్దతు ధర ప్రకటించాలి

బంట్వారం: కందులకు మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు కుమ్మక్కై కందుల ధరను తగ్గించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల కిందట క్వింటాల్ ధర రూ .7,800 ఉండగా, క్వింటాల్‌కు రూ. 1000 తగ్గించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దళారి వ్యాపారాన్ని అరికట్టడంతో పాటు కంది రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

• దర్గాకు దారి చూపించాలని వినతి

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని కోస్గిరోడ్‌లోని షేక్ సాహెబ్ దర్గాకు దారి చూపించాలని మైనారిటీ నాయకులు ఎస్ఎం గౌసన్ తహసీల్దార్ విజయకుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. గతంలో దర్గాకు వెళ్లేందుకు ఓ పొలాన్ని దాటి వెళ్లాల్సి ఉండేదని, ఇటీవల దర్గా ముందు పొలం యజమానులు దారి బంద్ చేశారని వినతిలో పేర్కొన్నారు. తహసీల్దార్ విజయకుమార్ స్పందిస్తూ సర్వే చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ కరీం, డాక్టర్ హాదీ, సయ్యద్ ఖైరత్ అలీ ఖాద్రీ, ఎండీ.ఖాసీం, షబ్బీర్ అలీ, అహ్మద్‌ఖాన్, సయ్యద్ ఇసాక్ పాషా, జాహెద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

• త్వరలో షెడ్ నిర్మాణం

మర్పల్లి: త్వరలో మర్పల్లి వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో షెడ్ నిర్మాణం చేపట్ట నున్నట్లు చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ పాలక వర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తానన్నారు. మరో రెండు రోజుల్లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ధాన్యం బస్తాలను విక్రయించుకునేందుకు వచ్చే రైతుల కోసం అన్ని వసతులు కల్పిస్తామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని త్వరలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. బట్వారం మండల కేంద్రంలో మేకల సంత ఏర్పాటు చేసేందుకు పాలక వర్గం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, ఆయా మండలాల డైరెక్టర్లు మార్కెట్ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.